ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 240
పేజీలు : 5 వెల రూ. 2/-
ఆదివారం
21 సెప్టెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD



AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com





## యువతను విస్మరిస్తే ఉద్యమాలే..

జెన్-జీ శక్తిని తకువ అంచనా వేయొద్దు
నేపాల్, శ్రీలంక తరహాలో భారతదేశంలో
కూడా ఉద్యమాలు రావని చెప్పలేము
అభివృద్ధి, ఆవిష్కరణలను గాలికొదిలిన మోదీ
పాక్‌తో కాదు.. పశ్చిమ దేశాలతో పోటీపడాలి
చైనా, జపాన్ దేశాలను చూసి నేర్చుకోవాలి
రాష్ట్రంలో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ నడుస్తున్నది
ముంబైలో ఎన్డీటీవీ యువ సదస్సులో కేటీఆర్




2 లో

# స్థానిక ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమం


సీఎం రేవంత్‌రెడ్డికి
మంత్రుల సూచన
42 శాతం రిజర్వేషన్ల కోసం
వెంటనే జీవో జారీకి కసరత్తు
3, 4 రోజుల్లో మరోసారి
చర్చించి తుది నిర్ణయం...



**హైదరాబాద్:**
స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమమని సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అందుబాటులో ఉన్న మంత్రులతో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం అంతర్గతంగా చర్చించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికలకు వెళ్లడమే మంచిదని అత్యధిక మంది మంత్రులు అభిప్రాయపడ్డారని పార్టీవర్గాలు తెలిపాయి. అయితే, తుది నిర్ణయాన్ని సీఎంకే వదిలేసినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేలా వెంటనే జీవో జారీ చేసే దిశగా కసరత్తు చేయాలని నిర్ణయించారు.
ఈ ప్రక్రియపై స్పష్టత తీసుకుని.. 3, 4 రోజుల్లో మరోసారి సీఎం, మంత్రులు సమావేశమై ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. సెప్టెంబరు నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గతంలో మిగతా 2లో..

## పరిపూర్ణ నటుడికి ఫాల్కే పురస్కారం..

మలయాళ నట దిగ్గజం కీర్తి కిరీటంలో మరో కలికితురాయి
మలయాళ నట దిగ్గజానికి దాదా సాహెబ్ ఫాల్కే
2023 సంవత్సరానికి ఎంపిక



2 లో

## కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

- సీజేతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ



2 లో

# ఇండియాపై ట్రంప్ హెచ్-1బీ బాంబ్!

4 లక్షల మంది భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం
దరఖాస్తు ఫీజును రూ.88 లక్షలకు పెంచిన అమెరికా
కార్యనిర్వాహక ఉత్తర్వుపై డొనాల్డ్ ట్రంప్ సంతకాలు
తమకు గొప్ప ఉద్యోగులు కావాలన్న అమెరికా అధ్యక్షుడు
విదేశీ ఉద్యోగులను తీసుకోవడం ఇకనైనా ఆపాలంటూ
టెక్ కంపెనీలకు సూచించిన యూఎస్ వాణిజ్య మంత్రి
గతంలో వీసా ఫీజు 2-5 వేల డాలర్లు
ఇక నుంచి ఫీజు లక్ష డాలర్లు (రూ.88 లక్షలు)
ఎంతమంది భారతీయులపై ప్రభావం.. 4 లక్షల మంది
ఎంత ఎక్కువ చెల్లించాలి?.. సంవత్సరానికి 3.4 లక్షల కోట్లు

2 లో



# యువతను విస్మరిస్తే ఉద్యమాలే..

హైదరాబాద్, సెప్టెంబర్ 20 :
యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు పట్టించుకోవాలని, విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరించారు. నేపాల్, శ్రీలంక తరహాలో భారతదేశంలో కూడా ఉద్యమాలు రావని చెప్పలేమని పేర్కొన్నారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్ చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్-మసీద్, ఎవరు ఏం తింటున్నారు? ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాని మోదీ విజయం సాధించారని ఎద్దేవా చేశారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోదీ గాలికొదిలేశారని విమర్శించారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీపడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదని హితవుపలికారు. ముంబైలో శనివారం సాయంత్రం 'ఎన్డీటీవీ యువ- 2025-ది ముంబై చాప్టర్' సదస్సులో కేటీఆర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జెన్-జెడ్ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు.

**అపారమైన బాధ్యతతో పనిచేయాలి**

ప్రస్తుత తరం యువత (1997-2012 మధ్య జన్మించినవారు జెన్-జెడ్) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని, సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలని కేటీఆర్ సూచించారు. జెన్-జెడ్ శక్తిని తకువ అంచనా వేయవద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీభూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందని చెప్పారు. ఇదే జెన్-జెడ్ జనరేషన్ పవర్ అని అన్నారు. సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని పిలుపునిచ్చారు. 'రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?' అని యువతను కేటీఆర్ ప్రశ్నించారు.

**అత్యుత్తములతో పోల్చుకోవాలి**

ప్రపంచం అంతా ముసలితనంలో మూలుగుతుంటే భారతదేశం మాత్రం యువరక్తంతో ఉరకలెత్తుతున్నదని కేటీఆర్ అన్నారు. దేశంలో సగటు వ్యక్తి వయస్సు 27 సంవత్సరాలని, 50% జనాభా 35 ఏండ్లలోనే ఉన్నారని చెప్పారు. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవని గుర్తుచేశారు. 'అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ, 40 ఏండ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితమైంది. కానీ, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒకరూ ఆలోచించాలి. మనం ఎప్పుడైనా అత్యుత్తములతో పోల్చుకోవాలి. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో పోల్చుకుని మురిసిపోతున్నాం' అని ఎద్దేవా చేశారు.

**విధ్వంసం నుంచి వికసించిన జపాన్**

అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్.. కేవలం 23 ఏండ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రపంచంలో న్యూక్లియర్ దాడి జరిగిన ఏకైక దేశం జపాన్ అని, భూకంపాలు, సునామీలు వచ్చినా తట్టుకొని నిలబడిందని చెప్పారు. 1945లో హిరోషిమా, నాగసాకిపై అణుదాడి జరిగి లక్షలాది మంది చనిపోయినా జపాన్ కుంగిపోలేదని అన్నారు. ఎన్నో భౌగోళిక అనుకూలతలు ఉన్నా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా వాటన్నింటినీ తట్టుకుని అద్భుత ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణతో నేడు మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్ ఎదిగిందని పేర్కొన్నారు. జపాన్ సాధించినప్పుడు భారత్ ఎందుకు సాధించలేకపోయిందో ప్రతి ఒకరూ ఆలోచించాలని కోరారు. జపాన్ ఆలోచన విధానమే కారణమని, వచ్చే పదేండ్లలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పారు.

**తెలంగాణ చేసింది.. భారత్ ఎందుకు చేయలేకపోయింది?**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని కేటీఆర్ సోదాహరణలతో వివరించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉన్నది. ప్రపంచంలోనే అమెజాన్‌కు అతిపెద్ద క్యాంపస్ తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్నది.

ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ (టీ-హబ్) హైదరాబాద్‌లో ఉన్నది. కేవలం పదేండ్లలోనే తెలంగాణ ఇన్ని చేయగలిగినప్పుడు, మిగతా భారతదేశం ఎందుకు చేయలేకపోయింది? ఒకసారి ఆలోచించాలి' అని కేటీఆర్ సూచించారు. 'సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ నారాయణ్ వంటి వారు అమెరికన్ కంపెనీలకు సీఈవోలు అయితే మనం సంతోషిస్తాం. కానీ, మన దేశం నుంచి ఒక ప్రపంచస్థాయి ఆవిష్కరణ కూడా రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని కేటీఆర్ చురకలంటించారు. మనకు వెంచర్ క్యాపిటల్ కాదు, అడ్వెంచర్ క్యాపిటల్ కావాలని సూచించారు. మనదేశంలోని 38 కోట్ల జెన్-జెడ్ యువత సరికొత్త ఆలోచనలతో ప్రపంచగతిని మార్చేందుకు ప్రభుత్వాలతో, పరిశ్రమలతో కలిసి పనిచేయాలని కోరారు. 'పెట్టుబడి లేకపోవడం కాదు.. మీ ఊహాశక్తి, ఆశయాలే మిమ్మల్ని ఆపుతున్నాయి' అని యువతలో కేటీఆర్ స్ఫూర్తి నింపారు.

# మహమ్మద్ ప్రవక్త ( స) జీవితం ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

**(జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్ )**

ఏఎం న్యూస్, 20 సెప్టెంబర్ ఖమ్మం:
జమాతే ఇస్లామి హింద్ ఇందిరానగర్ నార్త్ శాఖ కార్యాలయంలో మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రవక్త సందేశ ప్రచార ఉద్యమంలో భాగంగా నేడు నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బి అధ్యక్షతన మహిళా పండితుల సమావేశం నిర్వహించబడింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (సఅసం) జీవితం మనందరికీ మార్గదర్శకమని ఆయన ప్రజల పట్ల ఎంతో జాలి, కరుణ, ఆదరణ చూపించే వారనీ ఆయన నోటి ద్వారా చేతల ద్వారా ఎప్పుడు ఏ ఒక్కరిని ఇబ్బంది కలిగించలేదని ,ఆయన అనుచరులుగా మనం కూడా ఆయన్ను ఆదర్శంగా తీసుకొని మన జీవితాలను చక్కదిద్దుకోవాలన్నారు. మహమ్మద్ ప్రవక్త ఒక కొడుకుగా, ఒక తండ్రిగా, ఒక సోదరుడిగా, ఆదర్శ దైవదాసుడిగా ,గొప్ప పరిపాలకుడిగా, ఒక స్నేహితుడిగా, ఆయన ఆదర్శ జీవితం ఒక తెరిచిన పుస్తకంలా మన ముందున్నదని ఆయన జీవిత చరిత్రను తెలుసుకొని ఆచరించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన ఆదర్శ బోధనలు పాటిస్తే సమాజంలో శాంతి



సౌభ్రాతృత్వం సోదర భావం వెలసిల్లుతాయని తెలియజేశారు. అనంతరం ఇస్లాం మహిళా పండితుల అధ్యక్షురాలు ఖాసీమా షాహిన్ మాట్లాడుతూ ప్రవక్త మొహమ్మద్ (స ) బోధనలు ఉటంకిస్తూ ఆయన ఆదర్శ జీవితం ,ఉత్తమమైన నడవడిక, ఆయన గుణగణాలు గురించి శ్రోతల హృదయాలను కదిలించే విధంగా ప్రసంగించారు .నేటికి ఆయన జీవితం ముస్లింలకే కాక ప్రపంచ మానవులందరికీ ఆదర్శమని, ఆయన బోధనలను అందరూ తూ.చా .తప్పకుండా పాటించవలసిన అవసరం నేడు ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అంజుమ్ ,ఖమ్మం సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుమ్ జమాత్ సభ్యులు ఆరిఫా, హబీబా ,సాలే హ తస్లీమ్, జహరా ఫాతిమా, సబిహ , ఫాతిమా , తబస్సుం, ఆస్మా , నసీమా ,శంసున్నిసా మరియు మహిళా మహిళా ఇస్లామియా పండితులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# పరిపూర్ణ నటుడికి ఫాల్కే పురస్కారం..

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :
మోహన్‌లాల్ అనగానే ఎన్నో అద్భుతమైన పాత్రలు కళ్లముందు కదలాడుతాయి. విలక్షణ పాత్రల ద్వారా నటనకు పర్యాయపదంగా నిలిచిన ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. భారతీయ సినిమాలో అత్యంత ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు మోహన్‌లాల్‌ను వరించింది. 2023వ సంవత్సరానికి గాను ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. భారతీయ సినీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చరిత్ర మోహన్‌లాల్‌ది అని కేంద్ర సమాచార, ప్రసారశాఖ ఓ ప్రకటనలో కొనియాడింది. ఈ నెల 23న జరిగే 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల వేడుకలో మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని స్వీకరించబోతున్నారు.

మోహన్‌లాల్ అసలు పేరు మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్. 1960 మే 21న కేరళలోని పతనంతిట్టలో ఆయన జన్మించారు. ఆరో తరగతిలోనే నటనకు శ్రీకారం చుట్టిన లాల్.. ఓ నాటకంలో 90ఏండ్ల వృద్ధుడిగా నటించి వీక్షకుల ప్రశంసలందుకున్నారు. 1978లో స్నేహితులు నిర్మించిన 'తిరణోత్తం' మోహన్‌లాల్ తొలి సినిమా. కానీ ఆ సినిమా విడుదల కాలేదు. 'మంజిల్ విరింజ పూక్కల్'(1980) చిత్రంతో విలన్‌గా ప్రేక్షకులకు పరిచయమయ్యారు మోహన్‌లాల్. ఆ సినిమా గుర్తింపు తెచ్చిపెట్టడంతో.. ప్రారంభంలో ప్రతినాయకునిగా పలు చిత్రాల్లో నటించారు. 1986లో వచ్చిన 'రాజ వింటే మకన్' హీరోగా మోహన్‌లాల్‌కు తొలి బ్రేక్. ఆ చిత్రంలో ఆయన పోషించిన అండర్‌వరల్డ్ డాన్ పాత్ర మోహన్‌లాల్‌కు స్టార్ ఇమేజ్‌ని తెచ్చిపెట్టింది.

అదే ఏడాది విడుదలైన 'టి.పి.బాలగోపాలన్ ఎం.ఎ' చిత్రంతో ఉత్తమనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డును అందుకున్నారు మోహన్‌లాల్. అక్కడ్నుంచి హీరోగా ఆయన ప్రయాణం అప్రతిహతంగా సాగింది. చిత్రం, కిరీడం, కిలుక్కుం, చంద్రలేఖ, నరసింహం, భరతం, దేవాసురం, మణిచిత్రతాళు, కాలాపానీ, యోధ, అభిమన్యు, తన్మాంత్ర, దృశ్యం, పులిమురగన్, లూసిఫర్.. ఎలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అద్భుతమైన చిత్రాలు, అత్యద్భుతమైన పాత్రలు మోహన్‌లాల్ కెరీర్‌లో సాక్షాత్కరిస్తాయి.

ఇతర భాషల్లో.. మలయాళంలో సూపర్‌స్టార్‌గా ఎదిగిన మోహన్‌లాల్.. ఇతర భాషా చిత్రాల్లోనూ నటుడిగా తనదైన ముద్ర వేశారు. తమిళ రాజకీయ చరిత్ర ఆధారంగా మణిరత్నం తెరకెక్కించిన 'ఇరువర్' చిత్రంలో ఎమ్జీఆర్‌ను పోలిన పాత్ర పోషించారు మోహన్‌లాల్. ఆ సినిమా ఫలితం ఎలావున్నా.. నటుడిగా మాత్రం మోహన్‌లాల్‌ని మరో స్థాయిలో నిలబెట్టింది. ఇక మోహన్‌లాల్ తెలుగులో నటించిన తొలి చిత్రం నందమూరి బాలకృష్ణ 'గాండీవం'(1994). ఆ సినిమాలోని 'గోరువంక వాలగానె గోపురానికి..' పాటలో తళుక్కున మెరిశారు లాల్. ఆ సినిమా వచ్చిన 22ఏండ్ల తర్వాత యేలేటి చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'మనమంతా' (2016) సినిమాలో తొలిసారి తెలుగులో హీరోగా నటించారాయన. అదే ఏడాది ఎన్టీఆర్ 'జనతా గ్యారేజ్' సినిమాలో అద్భుతమైన పాత్ర పోషించి తెలుగులోనూ అఖండ విజయాన్ని అందుకున్నారు. బాలీవుడ్‌లో మోహన్‌లాల్ తొలి సినిమా రామ్‌గోపాల్‌వర్మ 'కంపెనీ'. ఆ తర్వాత ఆగ్, తేజ్ చిత్రాల్లో నటించారు. కన్నడంలో 'లవ్' సినిమాలో ప్రత్యేక పాత్ర పోషించారు.

**రికార్డుల వేటగాడు**

దాదాపు నాలుగు దశాబ్దాల నట ప్రస్థానంలో 400పై చిలుకు చిత్రాల్లో నటించారు మోహన్‌లాల్. ఎన్నో శతదినోత్సవాలు, రజతోత్సవాలు, వజ్రోత్సవాలు ఆయన కెరీర్‌లో ఉన్నాయి . కేరళ సినిమా రికార్డుల పరంగా కనీవినీ ఎరుగని చరిత్రను సృష్టించిన కథానాయకుడు మోహన్‌లాల్. మలయాళంలో తొలి వందకోట్ల సినిమా 'పులిమురుగన్'(2016). ఆ సినిమా తెలుగులో 'మన్నెంపులి'గా విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. మలయాళంలో తొలి 200కోట్ల సినిమా 'లూసిఫర్'(2019). చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' ఈ సినిమా రీమేకే.

జనం మెచ్చిన మహానటుడు.. మోహన్‌లాల్‌ను 'ది కంప్లీట్ యాక్టర్' అని ప్రేమతో పిలుస్తుంటారు అభిమానులు. ఆయన కెరీర్‌లో మెమొరబుల్ పాత్రలు ఎన్నో ఉన్నాయి. వాటిలో 'తన్మాత్రా' ఒకటి. అందులో అల్జిమర్ వ్యాధిగ్రస్తుడిగా నటించారాయన. నటుడిగా ఆయన కెరీర్‌లో చెప్పుకోదగ్గ పాత్రల్లో ఇదొకటి. ఇక 'కాలాపానీ'లో అయితే.. లాల్ నటన అనితరసాధ్యం. ఆయన చేసిన తమిళ్ సినిమా 'ఇరువర్' షూటింగ్‌లో, మోహన్‌లాల్ నటిస్తూవుంటే కట్ చెప్పడం మరిచిపోయారట దర్శకుడు మణిరత్నం.

ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇలా చెప్పుకుంటే ఎన్నో విభిన్నమైన చిత్రాలు. వైవిధ్యమైన పాత్రలు బహుముఖ ప్రజ్ఞాశాలి మోహన్‌లాల్ అద్భుతమైన ప్రతిభాశాలి.. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన మహానటుడు మాత్రమే కాదు. నిర్మాత, దర్శకుడు, గాయకుడు కూడా. 'బరోజ్' అనే వైవిధ్యమైన సినిమాకు దర్శకత్వం కూడా వహించారాయన. ప్రణవం ఆర్ట్స్ ఇంటర్నేషనల్ సంస్థ స్థాపించి ఎన్నో చిత్రాలను నిర్మించారు. మోహన్‌లాల్ గొప్ప గాయకుడు. సినిమాల్లోనే కాదు, వేదికలపై కూడా ఆయన పాటలు పాడిన సందర్భాలున్నాయి. ఆయన కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ ప్రస్తుతం హీరోగా కొనసాగుతున్నారు.

అవార్డుల రారాజు.. కెరీర్‌లో అయిదుసార్లు జాతీయ అవార్డులను అందుకున్నారు మోహన్‌లాల్. అందులో ఉత్తమ నటుడిగా రెండు సార్లు, నిర్మాతగా ఒకసారి('వానప్రస్థం' చిత్రానికి), జ్యూరీ విభాగాల్లో రెండు సార్లు అవార్డులను గెలుచుకున్నారు. అలాగే 17 పర్యాయాలు కేరళ రాష్ట్ర అవార్డులు, 11 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఆయన కైవసం చేసుకున్నారు. భారతీయ సినిమాకు చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో సత్కరించింది. ఇవిగాక మరెన్నో అవార్డులు ఆయన కీర్తికిరీటంలో ఉన్నాయి.

# ఇండియాపై ట్రంప్ హెచ్-1బీ బాంబ్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 :**
ఇండియన్ టెకీల డాలర్ డ్రీమ్స్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నీళ్లు చల్లారు. అగ్రరాజ్యంలో ఉద్యోగం చేద్దామని గంపెడాశతో ఉన్న సాంకేతిక నిపుణులపై పిడుగు వేశారు. సుంకాలు, అక్రమ వలసల పేరిట ఇప్పటికే కఠిన నిర్ణయాలను తీసుకొచ్చిన ట్రంప్.. ఇప్పుడు హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు (రూ. 88 లక్షలు) పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై శుక్రవారం సంతకాలు చేశారు. తాజా నిర్ణయం ఆదివారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం.. ఆదివారం ఉదయం 9.30 గంటలు) అమల్లోకి వస్తుందని తెలిపారు. తాను తీసుకొన్న నిర్ణయానికి సాంకేతిక రంగం మద్దతు ఇస్తుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తులే తమ దేశానికి రావాలని, గొప్ప ఉద్యోగులనే తాము కోరుకొంటున్నామని తెలిపారు. దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు వెల్లడించారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకే తాను ఇలా చేసినట్టు తెలిపారు.

**విదేశీ ఉద్యోగులను తీసుకోవద్దు**

హెచ్-1బీ వీసా రుసుము పెంపునకు సంబంధించి ఇప్పటికే అన్ని పెద్ద కంపెనీలతో చర్చలు జరిపినట్టు అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్న విదేశీయులను ఉద్యోగాల్లోకి తీసుకోవడాన్ని నిలిపేయాలని ఈ సందర్భంగా ఆయన టెక్ కంపెనీలను కోరారు. మీరు (కంపెనీలు) ఎవరికైనా ట్రైనింగ్ ఇవ్వాలని అనుకొంటే అమెరికాలోని గొప్ప యూనివర్సిటీల్లో డిగ్రీ సాధించిన వారికే ఆ శిక్షణను ఇవ్వండి. మన ఉద్యోగాలను కొల్లగొడుతున్న ఇతర దేశీయులకు కొలువులు ఇవ్వడం ఇకనైనా ఆపండి అని ఆయన కోరారు.

**భారతీయులపై పెను ప్రభావం**

అమెరికా హెచ్-1బీ వీసాదారుల్లో భారతీయుల వాటా 72 శాతంగా ఉన్నది. ట్రంప్ తాజా నిర్ణయం నేపథ్యంలో 2023 నాటి లెక్కల ప్రకారం.. దాదాపు 4 లక్షల మంది భారతీయులపై హెచ్-1బీ వీసా పెంపు ప్రభావం పడవచ్చు. ఇక మీదట అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకొనేందుకు ఒక్కొక్క వీసాపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. హెచ్-1బీ వీసాను సాధారణంగా మూడు నుంచి ఆరేండ్ల మధ్య కాలానికి మంజూరు చేస్తారు. దీంతో వీసా గడుపు పొడిగింపునకు కూడా ఏడాదికి లక్ష డాలర్ల రుసుమును చెల్లించాల్సి వస్తుంది. ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికాలో కొలువు చేయాలనుకొనే భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడనున్నట్టు నిపుణులు చెప్తున్నారు.

**ఏమిటీ హెచ్-1బీ వీసా?**

అమెరికాలోని టెక్ కంపెనీల్లో నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులు పనిచేయడానికి ఉద్దేశించినవే హెచ్-1బీ వీసాలు. 1990లో ఇమిగ్రేషన్ యాక్ట్, 1990 ద్వారా అప్పటి అధ్యక్షుడు జార్జ్ బుష్ దీన్ని తీసుకొచ్చారు.

**టాప్‌లో ఇండియన్స్**

హెచ్-1బీ వీసాదారుల్లో భారతీయ ఉద్యోగుల వాటా 72 శాతంగా ఉన్నది. ఏటా అమెరికా జారీ చేసే ప్రతీ పది హెచ్-1బీ వీసాల్లో ఏడుకు పైగా వీసాలు భారతీయ ఉద్యోగులకే దక్కుతున్నాయి. భారత్ తర్వాత చైనా 11.7 శాతంతో రెండో స్థానంలో ఉన్నది.

హెచ్-1బీ అడ్మినిస్ట్రేషన్ ఫీజు కింద ఇప్పటివరకూ 2వేల నుంచి 5 వేల డాలర్ల వరకు వసూలు చేసేవారు. అది ఇప్పుడు లక్ష డాలర్లకు (రూ.88 లక్షలు) చేరింది. దీంతో దరఖాస్తుదారులపై విపరీత భారం పడింది. హెచ్-1బీ వీసా రుసుము నాన్-రీఫండబుల్(వాపసు రాదు) అన్న విషయం తెలిసిందే.

## స్థానిక ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమం..

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. బీసీ రిజర్వేషన్ల బిల్లులను గవర్నర్‌కు పంపినా ఇంతవరకు ఆమోదం పొందలేదు. గతంలో పంపిన బిల్లులపై కేంద్రం నుంచి కూడా స్పందన లేదు. బిల్లుల ఆమోదానికి భాజపా రాజకీయ కారణాలతో సహకరించదని, ఎన్నికలను వాయిదా వేయడం వల్ల ఉపయోగం ఉండదని కొందరు మంత్రులు చెప్పినట్లు సమాచారం. బిల్లుల ఆమోదంతో సంబంధం లేకుండా రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వమే జీఓ జారీ చేసి... ఎన్నికలకు వెళ్లేందుకు ఉన్న అవకాశాలను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. ఒకవేళ న్యాయపరమైన అవరోధాలు ఎదురైతే పార్టీపరంగా బీసీలకు 42% టికెట్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ చర్చించినట్లు సమాచారం.

చట్టప్రకారం అధికారికంగా రిజర్వేషన్లను అమల్లోకి తెచ్చిన తరువాతే ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని సీఎంకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ శాసనసభలో ఆమోదించిన రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులను 90 రోజుల్లోగా ఆమోదించాలనే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకూ వేచి చూస్తే ఎలా ఉంటుందని సీఎం అడిగారని నేతలు తెలిపారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఈ నెలాఖరులోగా ఎన్నికలకు వెళ్లడమే మంచిదని మంత్రులు సూచించినట్లు సమాచారం. చివరకు సీఎంకే నిర్ణయం వదిలేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ ఇవ్వలేనిపక్షంలో మరింత గడువు కావాలని హైకోర్టును ప్రభుత్వం కోరాల్సి ఉంటుందనే దానిపైనా చర్చించినట్లు సమాచారం.

## కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

హైదరాబాద్:



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లు శనివారం ఇక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో భేటీ అయ్యారు. పలు జిల్లాల్లో కోర్టులు అద్దె భవనాల్లో నడుస్తున్న విషయాన్ని సీజే ప్రస్తావించారు. కొత్త జిల్లాల్లో నూతన భవనాల నిర్మాణంతోపాటు సిబ్బంది నియామకం చేపట్టాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ గత ఏడాది కాలంలోనే న్యాయ వ్యవస్థకు రూ.1,050 కోట్ల దాకా కేటాయించినట్లు తెలిపారు. న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పరిస్థితులను పరిశీలించి అవసరమైన జిల్లాల్లో కొత్త భవనాల ఏర్పాటుతోపాటు సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా కొన్ని కోర్టుల్లో అవసరానికి మించి సిబ్బంది ఉంటున్నారని, మరికొన్ని చోట్ల తక్కువగా ఉంటున్నారని, దీన్ని హేతుబద్ధీకరించాలని సీఎం సూచించారు. ఈ భేటీలో హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్యాం కోశీ, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, రిజిస్ట్రార్ జనరల్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో నీటియాజామన్య లోపం

**ఏటా వరదలు వస్తున్నా కాపాడుకోలేని దుస్థితి**

న్యూఢిల్లీ,సెప్టెంబర్:
వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవడం లేదు. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించడం లేదు. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నా నిర్లక్ష్యంతో ప్రజలను బలి చేస్తున్నారు. వరదలతో సామాన్యులు నిండా మునిగినా పాలకుల్లో చలనం రావడం లేదు. దేశంలో జాతీయ జలవిధానం కూడా అమలు కావడం లేదు. ప్రధాని మోడీ నదుల అనుసంధానం గురించి గొప్పలు చెప్పినా పదకొండేళ్లుగా ఆయనకూడా చేసింది శూన్యమనే చెప్పాలి. వరదప్రాంతాల ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించి వారు వరద బారినపడకుండా చేయడం లేదు. వివిధ రాష్ట్రాల్లో చెరువులను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. గతంలో ఎప్పుడూ లేనంతగా దేశంలో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయా ల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందిం చాల్సి ఉంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. అందుకు జాతీయ జలవిధానం కూడా అవసరమని గుర్తించాలి. జలవిధానంతో నదులను దారి మళ్లించగలిగితే నీటి కటకటలు రావు. ఈ యేడు వర్షాలు విపరీతంగా పడడమే గాకుండా వరదలు పొంగి నదులన్నీ ఉప్పొంగు తున్నాయి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి.

## ఫ్రీ మార్కెట్ అభూత కల్పన

**- ఇబ్బడిముబ్బడి దిగుబడులతో నష్టాలు - ఆంక్షలు విధించుకుంటేనే పురోగతి**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్:**
ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. యూరియా కొరతతో రైతులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. ఇదంతాదూరదృష్టి లోపంగానే చూడాలి. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజలంతా మళ్లీ ఉపాధి వదులకుని గ్రామాలకు తరలారని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. తెలంగాణలో ఇలాంటి యూనిట్లు పెట్టేవారిని ప్రోత్సహిం చాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిా సారం తగ్గుతోంది. ఏ పంట పండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు.

## వేధింపులు తట్టుకోలేక భర్తపై భార్య దాడి

**చికిత్స పొందుతూ మృతి**

**హైదరాబాద్,ఆగస్టు:**
క్షణికావేశంతో భార్యభర్తల మధ్య జరిగిన గొడవలతో దాడులు చేసుకోవడంతో ప్రాణాలు వదులుతున్నారు. ఈనేపథ్యంలో నగరంలోని కోకాపేట్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. భర్తపై భార్య కూరగాయల కత్తితో దాడి చేసి చంపేసింది. బతకుతెరువు కోసం కోసం దంపతులు కృష్ణ జ్యోతి బోరా, భరత్ బోరా అస్సాం నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. కొకాపేట్‌లో కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా భార్య కృష్ణ జ్యోతిని భర్త వేధింపులకు గురిచేస్తూ ఉన్నాడు. ఇదే క్రమంలో గత అర్ధరాత్రి కూడా చిన్న విషయానికి భార్యాభర్తలు వాగ్వాదానికి దిగారు. చివరకు భర్త వేధింపులు తాళలేక విచక్షణ కోల్పోయిన భార్య.. అతడిపై కత్తితో దాడి చేసింది. దీంతో అతడు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. భరత్ కేకలు విన్న స్థానికులు లోపలికి వచ్చి చూడగా భర్త రక్తపుమడుగులో పడి ఉన్నాడు.

# స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కార్యసమితి సమావేశం

ఏ ఎం న్యూస్, ఓయూ:
ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లోని ఆడిటోరియంలో స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కార్యసమితి సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 95 మంది ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ సి.ఏ.ఆర్. సుందరం, జాతీయ సంఘటన కార్యదర్శి కశ్మీర్ లాల్, జాతీయ సహ సంఘటన కార్యదర్శి సతీష్ కుమార్ ముఖ్య పలు అంశాలపై ఉద్ఘాటించారు. భారతీయ ఆర్థిక స్వావలంబన, స్వదేశీ ఆధారిత అభివృద్ధి, సామాజిక, ఆధ్యాత్మిక సమన్వయం, యువతలో స్వదేశీ చైతన్యం పెంపు వంటి అంశాలపై జరిగిన చర్చలు సమావేశానికి విశేష ప్రాధాన్యాన్ని తీసుకువచ్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో స్వదేశీ ఉత్పత్తులు, స్వావలంబన, స్థానిక ఆర్థిక శక్తిని బలోపేతం చేయడం వంటి అంశాలను మరింత బలంగా అమలు చేయడానికి ఈ సమావేశం కొత్త దిశలో ఆలోచనలకు మార్గం సుగమం చేసింది. జాతీయ కార్యసమితి సమావేశం భారత ఆర్థిక వ్యవస్థలో స్వదేశీ భావనను మరింత విస్తరింపచేందుకు స్పష్టమైన కార్యాచరణకు దిశానిర్దేశం చేయనుంది. ఈ సందర్భంగా స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ క్షేత్ర కన్వీనర్ డా. సత్తు లింగమూర్తి రచించిన "స్వదేశీ – ఆత్మశక్తి" పుస్తకాన్ని జాతీయ కన్వీనర్ సి.ఏ.ఆర్. సుందరం, జాతీయ సంఘటన కార్యదర్శి కశ్మీర్ లాల్, జాతీయ సహ సంఘటన కార్యదర్శి సతీష్ కుమార్ కలిసి ఆవిష్కరించారు. స్వదేశీ తత్త్వం ఎందుకు అవసరం, దాని ఆవశ్యకత ఏమిటి, దాన్ని వ్యక్తిగతం నుంచి జాతీయ స్థాయికి ఎలా ఆచరణలోకి తీసుకురావాలి అనే ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు అందించే ఈ పుస్తకం, భారతీయ ఆర్థిక ఆత్మవిశ్వాసానికి ప్రేరణగా నిలుస్తుంది.




# కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం

- నగర ప్రథమ పౌరురాలు..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసే కార్య క్రమం శనివారం యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి ( జూబ్లీహిల్స్ నియోజక వర్గం) స్టేడియంలో జరిగింది. ఈ కార్య క్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్,సీతక్క, ముఖ్య అతిథిలుగా పాల్గొని మహిళలకి రుణాలను అందజేశారు. బట్టి విక్రమార్క మాట్లాడుతూ మొదట మహిళలను అభినందించారు . మహిళాలు ఆర్థికం గా ఎదిగే స్వయం సమృద్ధి పదకాలు కాంగ్రెస్ పార్టీ తో నే సాధ్యం అని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి ఉంది. అని అన్నారు నగర ప్రథమ పౌరురాలు గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులుగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళుతుందని, ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు బలమైన తోడుగా నిలవాలని" పిలుపునిచ్చారు. కలెక్టర్ తో పాటు ఈ కార్య క్రమంలో వివిధ హోదాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, జిహెచ్ ఎం సీ అధికారులు,పోలీస్ యంత్రాగం పాల్గొన్నారు అధిక సంఖ్యలో వచ్చిన మహిళలతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



# ప్రభుత్వరంగ సంస్థల అమ్మకంతో దెబ్బ

**ఉపాధిరంగాలపై తీవ్ర ప్రభావం**

ముంబై,సెప్టెంబర్:
ఇప్పట్లో మన ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా కానరావడం లేదు. ప్రధానంగా నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతున్నా... అందుకు తగగిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రభుత్వం రంగ సంస్థలను అప్పనంగా అమ్మేయడంతో ఈ సమసయమరితం తీవ్రం కాబోతున్నదన్న భయాలు వస్తున్నాయి. అయినా మోడీ ప్రభుత్వం ఎక్కడా తగ్గడం లేదు. దీంతో కార్పోరేట్లు మరింత బలపడుతున్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ..ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సిన ఆలోచన చేయడం లేదు. ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకుమించి ఉంటుందని అంటున్నారు. కరోనాకు ముందే మన ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగా ఉంది. వస్తూత్పత్తి పెరిగినా.. ధరల పోటు తప్పలేదు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపు తోంది. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామరాజన్ గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించుకోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడుకాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2–3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని విశదీకరిం చారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాల్సి ఉంది.

# 'వక్ఫ్' పై సుప్రీం తీర్పు మోదం, ఖేదం

**ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ వైస్ ప్రెసిడెంట్ –జమాత్ ఇ ఇస్లామీ హింద్ –టెఫ్రీస్ కౌన్సిలర్ – హెచ్. ఎం. ఎస్. హింద్ మజ్దూర్ సభ – జాతీయ కార్యదర్శి, 9949476824**

వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన ఏకపక్ష అధికారాలను కోర్టు తిరస్కరించింది. ఒక ఆస్తి ప్రభుత్వానికి చెందిందా లేక వక్ఫ్ ఆస్తా అన్నది జిల్లా కలెక్టర్ కు నిర్ణయించే అధికారం ఉండదని కోర్టు చెప్పింది. పౌరుల వ్యక్తిగత హక్కుల విషయంలో జిల్లా మేజిస్ట్రేట్ తీర్పులు ఇవ్వలేరని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఒక వ్యక్తి కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాం మతాన్ని ఆచరిస్తేనే తన ఆస్తిని వక్ఫ్ చేయగలడు. అనే నిబంధనను రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛకు వ్యతిరేకమని తేల్చి చెప్పింది. వక్ఫ్ అనేది మతపరమైన దానం, దానికోసం ఎలాంటి కాల పరిమితి విధించడం పూర్తిగా అసంబద్ధం. ఈ అంశాలన్నింటిపై ప్రభుత్వం కొత్త నియమాలు నిర్ణయించే వరకు స్టే అమలులో ఉంటుందని కోర్టు స్పష్టంచేసింది.

రతదేశం మతపర, సాంస్కృతిక, సామాజిక వైవి భాధ్యానికి ప్రతీక, ఇక్కడ మైనారిటీ హక్కుల పరిరక్షణ రాజ్యాంగపర హామీ. కానీ, తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక తీర్పు ముస్లిం సమాజం ఆశలకు భిన్నంగానే వచ్చింది. మూడు ప్రొవిజన్లపై విధించిన తాత్కాలిక స్టే కొంత ఊరటనిచ్చినా, మొత్తంగా చూస్తే నిరాశనే కలిగిం చింది. ఇస్లాం సంప్రదాయం ప్రకారం వక్ఫ్ అనేది ఒక వ్యక్తి తన ఆస్తిని అల్లాహ్ పేరుతో శాశ్వతంగా సమాజ ప్రయోజనాల కోసం కేటాయించడం. ఈ ఆస్తులను అమ్మడం, బదిలీ చేయడం సాధ్యం కాదు. విద్య, మసీదులు, దానధర్మాలు, అనాథాశ్రమాలు, ఆరోగ్య సేవలు ఇలా అనేక రంగాలలో వక్ఫ్ ఆస్తులు శతాబ్దాల తరబడి ఉపయోగించబడ్డాయి. కాబట్టి ఇది కేవలం భూములు, భవనాల సమస్య కాదు.

ఇది ధార్మికపర కర్తవ్యం, విశ్వాసానికి సంబంధించిన అంశం. దేశంలో ముస్లింల ధార్మిక, సామాజిక అవసరా లకు శతాబ్దాలుగా వినియోగించబడుతున్న వక్ఫ్ ఆస్తులు మసీదులు, దర్గాలు, ఖబరస్తాన్లు, మదరసాలు, అనాథాశ్ర మాలు, దాతృత్వ సంస్థలు ఆధారంగా నిలిచాయి. బ్రిటిష్ కాలం నుండే వక్ఫ్ వ్యవస్థకు చట్టపర రక్షణ ఉంది. 1954 లో తొలి వక్ఫ్ చట్టం తరువాత 1995 చట్టం ద్వారా ఈ ఆస్తుల పరిరక్షణకు మరింత చట్టబద్ధత కల్పించబడింది.

ఇటీవల మన మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ (సవరణ) చట్టం 2025 మాత్రం అనూహ్య వివాదాలకు దారితీసిం ది. ఈ చట్టం వక్ఫ్ ఆస్తుల నిర్వచనాన్ని మార్చడం, వాటిపై ముస్లిం సమాజానికి ఉన్న ప్రత్యేక హక్కులను పరిమితం చేయడం, వాటిని సాధారణ భూసర్వే పరిధిలోకి తేవడం వంటి నిబంధనలు ఉండటంతో ముస్లింలలో ఆందోళన వ్యాప్తి చెందింది.

వినియోగదారుని ద్వారా వక్ఫ్..కోర్టు తాత్కాలికంగా నిలిపివేయని నిబంధనలలో, వినియో గదారుని ద్వారా వక్ఫ్ అనే పాత ఇస్లామిక్ సూత్రాన్నిగు ర్తించకపోవడం కూడా ఉంది. శతాబ్దాలుగా ఒక ఆస్తి వక్ఫ్ ప్రయోజనాల కోసం వాడుకలో ఉంటే అది స్వయంగా పక్ఫ్ గా పరిగణించబడేది. కొత్త చట్టం ఆ అవకాశాలను తీసేసింది. ఇది వక్ఫ్ ఆస్తుల స్వరూపాన్నే దెబ్బతీసే ప్రమా దకర మార్పు. ప్రభుత్వం వాదన ఏమిటంటే వక్ఫ్ ఆస్తులు తరచుగా దుర్వినియోగానికి గురవుతున్నాయి. అవి పాత దర్శకంగా నిర్వహించబడటం లేదు. అందుకే ఈ నూతన చట్టం ద్వారా రికార్డుల సమగ్రతను తీసుకురావడం అవస రమని కేంద్రం చెబుతోంది. కానీ, కేంద్రం వాదన వెనుక వేరే ఉద్దేశ్యం దాగి ఉందని ప్రతిపక్షాలు, ముస్లిం ధార్మిక సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల ను తేలికగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకుని, వాటిని తమ ప్రయోజనాలకు అనుకూలంగా మలచుకోవడం. అనుమానాలకు బలం చేకూర్చేలా కొన్ని నిబంధనలు రూపొందించబడ్డాయి. ముఖ్యంగా, వక్ఫ్ ఆస్తి అని గుర్తిం చబడటానికి ఇకపై కేవలం ముస్లింల వాంగ్మూలం లేదా చారిత్రక ఆధారాలు సరిపోవు. భూ సర్వే, రెవెన్యూ రికార్డులు తప్పనిసరి అన్న నిబంధన తీవ్ర వివాదాస్పదమైంది.

మరో సమస్య, ప్రతి వక్ఫ్కి తప్పనిసరిగా లిఖిత పూర్వక డీడ్ ఉండాలనే నిబంధన, వాస్తవానికి అనేక వక్ఫ్లు సం ప్రదాయంగా మౌఖికంగా లేదా సమాజ అంగీకారంతో ఏర్పడ్డాయి. వాటిని అకస్మాత్తుగా చెల్లనివిగా మార్చడం, ముస్లిం సమాజం శతాబ్దాల ఆస్తులను నిర్వీర్యం చేయడమే అవుతుంది.

అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోకి తేవడం..అదే సమయంలో, వక్ఫ్ బోర్డుల స్వతంత్రతను కుదించేలా, వాటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోకి తేవడం, వక్ఫ్ ట్రైబ్యునల్ అధికారాలను తగ్గించడం వంటి ప్రతిపా దనలు కూడా చట్టంలో చోటు చేసుకున్నాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా ముస్లిం సమాజంలో అసంతృప్తి, నిరసనలు చెలరేగాయి. వివిధ వక్ఫ్ బోర్డులు, ముస్లిం మత పెద్దలు, పౌరసంఘాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లను పరిశీలించిన సుప్రీంకోర్టు 15 సెప్టెంబర్ 2025 న కీలక తీర్పు వెలువరించింది. వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయకపోయినా, కొన్ని విభాగాల రక్షణ అవసరాన్ని కోర్టు ప్రస్తావించింది. సుప్రీంకోర్టు మరో ముఖ్యమైన అంశంపై స్పష్టతనిచ్చింది. మతపరమైన పరి పాలనలో బాహ్య జోక్యం ఉండకూడదని. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్లో 22 మంది సభ్యులలో నలుగురికంటే ఎక్కువ మంది ముస్లిమేతరులు ఉండరాదని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో 11 మంది సభ్యులలో ముగ్గురికంటే ఎక్కువమంది ముస్లి మేతరులు ఉండరాదని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం వక్ఫ్ పరిపాలనలో ముస్లిం సమాజానికి కనీస నియంత్రణ కల్పించే రక్షణాత్మక చర్యగా పరిగణించవచ్చు.

ఏకపక్ష అధికారాలను కోర్టు.. అలాగే, వక్ఫ్ ఆస్తుల పై ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన ఏక పక్ష అధికారాలను కోర్టు తిరస్కరించింది. ఒక ఆస్తి ప్రభు త్వానికి చెందిందా లేక వక్ఫ్ ఆస్తా అన్నది జిల్లా కలెక్టర్ కు నిర్ణయించే అధికారం ఉండదని కోర్టు చెప్పింది. పౌరుల వ్య క్తిగత హక్కుల విషయంలో జిల్లా మేజిస్ట్రేట్ తీర్పులు ఇవ్వ లేరని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఒక వ్యక్తి కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాం మతాన్ని ఆచరిస్తేనే తన ఆస్తిని వక్ఫ్ చేయగలడు. అనే నిబంధనను రాజ్యాంగ

Waqf (Amendment) Act..

విరుద్ధమని, మత స్వేచ్ఛకు వ్యతిరేకమని తేల్చి చెప్పింది. వక్ఫ్ అనేది మతపరమైన దానం, దానికోసం ఎలాంటి కాల పరిమితి విధించడం పూర్తిగా అసంబద్ధం. ఈ అం శాలన్నింటి పై ప్రభుత్వం కొత్త నియమాలు నిర్ణయించే వరకు స్టే అమలులో ఉంటుందని కోర్టు స్పష్టంచేసింది. సు ప్రీంకోర్టు అభిప్రాయం ప్రకారం. వక్ఫ్ చట్టం 2025 లోని కొన్ని నిబంధనలు ప్రాథమిక హక్కులకు, మత స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా, వక్ఫ్ ఆస్తుల నిర్వచనా న్ని పరిమితం చేసే నిబంధన, వక్ఫ్ బోర్డుల అధికారాలను తగ్గించే నిబంధన, వక్ఫ్ ట్రైబ్యునల్ నిర్ణయాలను ప్రభుత్వ పరిశీలనకు లోను చేసే నిబంధనలపై కోర్టు స్టే విధించింది. భూసర్వే అధికారులకు తుది అధికారం ఇవ్వడం తాత్కా లికంగా అమలుకు రాకూడదని ఆదేశించింది. సుప్రీం సెప్టెంబర్ 15 న ప్రకటించిన తాత్కాలిక తీర్పు. వక్ఫ్ చట్టం 2025 పై ఒక చట్టపర, సామాజిక, రాజకీయ చర్చకు తెరలేపింది. ఇది తుది నిర్ణయం కాకపోయినా, ముస్లింల మత స్వేచ్ఛ, ఆస్తి పరిరక్షణ, రాజ్యాంగ హామీల దిశగా ఒక బలమైన అడుగు. ప్రభుత్వం ఇప్పటికైనా పక్షపాత వైఖరి విడనాడాలి. మైనారిటీల ఆస్తులు రియల్ ఎస్టేట్ కాదని, అవి విశ్వాసం, సంప్రదాయం, చరిత్రల కలయిక అని గుర్తించాలి.





## యాదగిరిగుట్ట స్వామివారి సేవలో సిద్దనోళ్ల సంజీవరెడ్డి, టి.పి.సి.సి.స్టేట్, లేబర్ సెల్ సెక్రటరీ నర్సింగరావు

యాదగిరిగుట్ట సెప్టెంబర్ 20 ఏ ఎం న్యూస్:



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం తెలంగాణ టి.పి.సి.సి.లేబర్ సెల్ సెక్రటరీ నర్సింగరావు,వారితో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.గర్భాలయంలో స్వయంభు నరసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అష్టోత్తర పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది,వారితో సిద్దనోళ్ల సంజీవ రెడ్డి,సెరగడం నర్సింగరావు కే.నర్సింహారెడ్డి,రమేష్,వెనుముద్దాల యాదగిరి రెడ్డి,శివ,బోదాసు నర్సింహా,తదితరులు పాల్గొన్నారు.

## నాచారం సీఐ ధనుంజయ్‌ను కలిసిన మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్

ఏ ఎం న్యూస్ ఓయూ:




నాచారం పోలీస్‌స్టేషన్‌కు నూతన ఇన్స్పెక్టర్‌గా భాద్యతలు తీసుకున్న ధనుంజయ్‌ని మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, చంద్రమౌళి, రాజి రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, గంధమల్ల గోపి, అన్వర్, మొర నర్సింహ రెడ్డి, వేణుగోపాల్, క్రాంతి కుమార్, మంజుల వాణి, అరుణ, పార్వతి మరియు ఇతర నాయకులు.

### ఎ.కే.వై.ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## అర్హులైన వారికి ఉచిత కళ్లద్దాల పంపిణీ

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



రాజీవ్ నగర్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం)లో ఏ కే వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొంతకాలంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాలలో కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించి వారికి శనివారం ఎర్రగడ్డ రాజీవ్ నగర్ లోని గ్రౌండ్లో ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు మంత్రులు , ఇంచార్జి లు, వివిధ హోదాల నాయకులు( కాంగ్రెస్ పార్టీ) , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు అధిక సంఖ్యలో కాలని వాసులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ ఏ కేవై ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు ఒకేసారి మందికి ఉచితంగా కళ్లద్దాలను అందజేసిన ఫౌండేషన్ సభ్యులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకొని ప్రజలు తమ ఆరోగ్యాలను సంరక్షించుకోవాలని అన్నారు మాజీ ఎంపీ ,ఏ కే వై ఫౌండేషన్ చైర్మన్ ఎం అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏ కే వై ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్హులైన వారికి కాటరాక్ట్ ఆపరేషన్లను సైతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భవాని శంకర్( కాంటెస్ట్ డ్ కార్పొరేటర్ అభ్యర్థి)నిజాముద్దీన్ , మురళి గౌడ్ ( కాంటెస్ట్ డ్ ఎం ఎల్ ఏ అభ్యర్థి, మాజి కార్పొరేటర్),సంజయ్ గౌడ్( మాజీ కార్పొరేటర్),మొహమ్మద్ మోసిన్ ఖురేషి ,ఎర్ర కృష్ణ, మనోజ్ యాదవ్,కుమార్, దూడల రవి గౌడ్, బి అశోక్, ఆకాష్ ,తో పాటు రాణి, సురేఖ, పద్మ, తదితరులు పాల్గొన్నారు

## టికెట్ల ధరలపై ఆర్టీసీ యాజమాన్యం క్లారిటీ

హైదరాబాద్,ఆగస్టు19:
పండుగల నేపథ్యంలో బస్సు టికెట్ చార్జీలను పెంచినట్లు జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండించింది. టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. ప్రధాన పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే సర్వీసులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరిస్తుందని పేర్కొంది. స్పెషల్ బస్సుల్లో మాత్రమే సాధారణ చార్జీలో 50 శాతం వరకు సవరణ అమల్లో ఉంటుందని వివరించింది. టీజీఎస్ఆర్టీసీలో 2003 నుంచి ఈ పద్ధతి ఆనవాయితీగా వస్తోందని, ఇప్పుడే స్పెషల్ బస్సుల్లో కొత్తగా చార్జీలను సవరణ చేస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికింది. ప్రధాన పండగలైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారు. ఈ సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నడుపుతుంది. రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో ఖాళీగా ఆ బస్సులు వెళ్తుంటాయి. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 50 శాతం వరకు టికెట్ ధరను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. ' అని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. టీజీఎస్ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల వరకు బస్సులు సేవలందిస్తున్నాయి. పండుగ సమయాల్లో రద్దీకి అనుగుణంగా ప్రతి రోజు సగటున 500 నుంచి 1000 వరకు స్పెషల్ బస్సులను మాత్రమే సంస్థ నడుపుతుంది. ఆ స్పెషల్ బస్సుల్లో మాత్రమే జీవో ప్రకారం చార్జీల సవరణ ఉంటుంది. మిగతా రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ఇప్పుడు కూడా స్పెషల్ బస్సులను సంస్థ నడుపుతోందని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదీ వరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదీల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే చార్జీల సవరణను సంస్థ చేయనుందని పేర్కొంది. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది.